మామిడి రైతు డీలా

- అధిక వర్షాలతో రాలిపోయిన పూత
- భారీగా దిగుబడి తగ్గిపోయే అవకాశం
- ఆందోళనలో రైతులు

పూత రాలిపోయిన మామిడి చెట్లు

ప్రజాశక్తి - రాయచోటి

ఫలరాజుగా పేరుగాంచిన మామిడి మూడేళ్లుగా సరైన దిగుబడులు రావడం లేదు. రెండేళ్లుగా కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ ఏర్పాటు చేయడంతో రైతులందరూ డీలపడ్డారు. గతేడాది ఆశించిన స్థాయిలో మామిడి పంట పండలేదు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో మామిడి పంట అధిక దిగుబడిలో వస్తాయని రైతులు ఆశ పడ్డారు. డిసెంబర్ నెల పూర్తవుతున్న అంతంత మాత్రమే పూత వస్తోంది. అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చేవారు కూడా లేరని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలతో పూత ఆలస్యం కావడం, అవే వర్షాలు పురుగులు, తెగుళ్ల ఆశించడానికి దోహదపడటంతో..పూత నిలవక, పిందె ఎదగక రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.

89 వేల ఎకరాల్లో మామిడి తోటలు

జిల్లాలో 89,657.5 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. జిల్లాల్లో చిట్వేలిలో 4,400 ఎకరాలు, రైల్వేకోడూరులో 9067, ఓబులవారిపల్లిలో 1625, పెనగలూరులో 3380, పుల్లంపేటలో 490, మదనపల్లిలో 1475, నిమ్మనపల్లిలో 2050, రామసముద్రంలో 1500, గుర్రంకొండలో 4145, కలకడలో 3445, కలికిరిలో 2737.5, కె.వి.పల్లిలో 4625, పీలేరులో 3500, వాల్మీకిపురంలో 2875, నందలూరులో 1780, రాజంపేటలో 935, టి.సుండుపల్లిలో 7590, వీరబల్లిలో 5262.5, చిన్నమండెంలో 6250, గాలివీడులో 2300, లక్కిరెడ్డిపలిల్లో 6000, రామాపురంలో 3582.5, రాయచోటిలో 222.5, సంబేపల్లిలో 3075, బి.కొత్తకోటలో 715, కురబలకోటలో 750, ములకలచెరువులో 625, పెద్ద మండెంలో 1960, పిటిఎంలో 542.5, తంబళ్లపల్లెలో 750 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ప్రతి ఏటా దాదాపు రూ.200 కోట్లకు పైగా విలువైన దిగుబడులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ సారి అధిక వర్షాలు, గాలులతో వాతావరణంలో మార్పులతో దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధిక వర్షాలతో తేమ ఆరక..

అయితే మామిడి దిగుబడిపై ఈ ఏడాది అధిక వర్షాలు ప్రభావం చూపాయి. సాధారణంగా జూన్, జూలైలోనే వర్షాలు ప్రారంభమై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు కురుస్తాయి. ఈ ఏడాది డిసెంబర్ చివరివరకూ అధిక వర్షాలు కురిశాయి. నేలల్లో తేమ శాతం పెరిగింది. తేమ ఆరక, చెట్టుకు పూత రాకుండా కొమ్మలు చిగురించాయి. గతంలో నవంబరు నుంచి పూత వస్తుంది. జనవరి వచ్చినా ఇప్పటి వరకు అంతంత మాత్రమే పోతా పూస్తున్నది. కొన్ని రకాల చెట్లలోనే అసలు పూత రాలేదు. వచ్చిన పూత కూడా పొగ మంచు కమ్మేస్తోంది. వచ్చిన పూత కూడా నల్లగా మగ్గిపోతోంది. ప్రతికూల పరిస్థితులతో తేనె మంచు, తామర, పూత తిచే పురుగులు, బూడిద, పూత, మాడు, ఆకుజల్లెడ తెగుళ్ళు వస్తున్నాయి. మూడేళ్లుగా పంటలకు సరైన ఆదాయం రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏడదైనా మామిడి పంట సాగు అధిక దిగుబడులు వచ్చి రైతన్నలకు ఏమాత్రం దిగబడి వస్తుందో వేచి చూడాల్సిందే.

వ్యాపారస్తులతో ఇబ్బందులు

వ్యాపారస్తులు మొదట మామిడి చెట్ల పూత, పిందెలను చూసి కొనుగోలు చేసి అడ్వాన్స్ ఇచ్చి, మామిడికాయలు కోసిన తర్వాత సగం డబ్బులు ఇచ్చి, తర్వాత తమకు నష్టం వస్తుందని సగం డబ్బులతోనే సరిపెట్టుకుంటున్నారు. గతంలో ఈదురుగాలులు, వర్షాలకు మామిడి కొమ్మలు, చెట్లు, మామిడికాయలు నేలపాలవుతున్నాయి. ప్రభుత్వం ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి ఈ ఏడాదైనా ఈదురుగాలులు వర్షాలకు రాలిపోయిన నెలపాలవుతున్న మామిడి చెట్లకు, మామిడికాయలకు నష్ట పరిహారం అందించాలి.

- సుబ్బారెడ్డి, రైతు, యండపల్లి, రాయచోటి.

అధిక ఖర్చవుతోంది

మామిడి చెట్లకు ఏడాది పాటు దుక్కి చేయడం, చెట్లకు పాదులు తీయడం, మామిడి కొమ్మలు కత్తిరింపులు, ఎరువులు, మందులు, కూలీలు ,తోటకు కంచే అధిక ఖర్చులు అవుతున్నాయి. మామిడి పంట మాత్రం అంతంతే వస్తుంది. మందులు, ఎరువులు అధిక రేట్లను ప్రభుత్వం తగ్గించాలి.

- సుబ్రహ్మణ్యం, రైతు పీలేరు.

రైతులు ఆందోళన చెందొద్దు

గత సంవత్సరం మామిడి పంట సరిగ్గా రాలేదు. ఏడాది మామిడి పంట అధికంగా వస్తుంది. మామిడి పూత గత సంవత్సరం ముందస్తుగా పూసింది. ఏడాది జనవరి మొదటి వారం లోపల పూర్తిగా మామిడి పూత వస్తుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మామిడి తోటల్లో పూత సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో కొన్నిచోట్ల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి రైతుల్లో చైతన్యం చేస్తున్నాం. మామిడి పంట అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. నాణ్యమైన దిగుబడి రావడానికి నిపుణుల ద్వారా సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

- పి.రవి చంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి, రాయచోటి.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని విద్యార్థులందరికీ నాణ్య మైన విద్యను అందించడమే తమ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి వై.రాఘవరెడ్డి పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఏ విధంగా విద్యను బోధించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో డిప్యూటీ డిఇఒ, ఎంఇఒలు, ఉపాధ్యాయులు వివరాలు తెలపండి ?

జిల్లాలో డిప్యూటీ డిఇఒలు రాయ చోటి, మదనపల్లెలో ఇద్దరు ఉన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయాలు జిల్లాలో 30 ఉన్నాయి. 30 మంది ఎంఇఒలు ఉన్నాయి. 856 మంది ఉపాధ్యాయులున్నారు. ప్రాథమిక పాఠశాలలు 378, యుపి పాఠశాలలు 995, ఉన్నత పాఠశాలలో 4597 ఉపాధ్యాయులన్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఎన్ని, విద్యార్థులు ఎంతమంది ఉన్నారు?

జిల్లా వ్యాప్తంగా 2,210 ప్రభుత్వ పాఠశాలలు, 1,48969 మంది విద్యార్థులు, ప్రయివేట్ పాఠశాలు 555, 1,6,225 మంది విద్యార్థులున్నారు.

నాడు-నేడు కింద ఎన్ని పాఠశాలలు మంజూరయ్యాయి ? బడ్జెట్ ఎంత ?

ఉమ్మడి జిల్లాలో నాడు- నేడు కింద కొన్ని మంజూరయ్యాయి. రెండవ విడత పనుల కోసం రూ.3.36 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించింది. నాడు నేడు పనులతో మరుగుదొడ్లు, తరగతి గదులు నిర్మాణం, తాగు నీరు ఏర్పాటు, వంటగది, ప్రహరీ, పనులు చేపడుతున్నాం. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నారు. నిర్మాణం పనులన్నీ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో చేపడుతున్నాం.

అమ్మఒడి వర్తించాలంటే విద్యార్థులకు ఎలాంటి అర్హతలు ఉండాలి ?

అమ్మ ఒడివర్తించాలంటే విద్యార్థులు రోజూ పాఠశాలకు రావాలి. హాజరు 75 శాతం తగ్గకుండా తప్పనిసరిగా ఉండాలి.. నాలుగు చక్రాల వాహనాలు, ప్రభుత్వ ఉద్యోగం, 300 యూనిట్ల కంటే అధిక విద్యుత్ వినియోగం, ఐదు ఎకరాల కంటే భూమి ఉండకూడదు. తల్లిదండ్రుల బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానం చేయాలి. ఇవ్వన్నీ ఉంటే అమ్మఒడికి అర్హులవుతారు. ఇలాగైతే తల్లి అకౌంటులో ప్రతి ఏడాదీ రూ. 15 వేలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది.

జగనన్న గోరుముద్దు వివరాలు తెలపండి ?

జిల్లాలో 1,48,69 మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్ద ద్వారా రోజూ మధ్యాహ్నం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారు. ఎక్కడైనా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటున్నాం.

'పది' పరీక్షల్లో అధిక ఉత్తీర్ణత కోసం లాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

పదవ తరగతి విద్యార్థులకు రోజూ ఉపాధ్యాయులు బోధించడంతోపాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ప్రత్యేకమైన స్టడీ (ఆక్షన్ ప్లాన్) అమలుపరుస్తున్నాం. పది పరీక్షలలో అన్నమయ్య జిల్లాను ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం.

కోరేగావ్ విజయోత్సవ కార్యక్రమంలో నాయకులు

ఘనంగా కోరేగావ్ విజయోత్సవ దివస్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 205వ భీమా కోరేగావ్ విజయోత్సవ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఆదివారం విశ్రాంత అధ్యాపకులు సి.చంద్రయ్య, మాల మహనాడు సీనియర్ నాయకులు కె.గట్టప్ప, రాష్ట్ర గిరిజన సమైక్య నాయకులు కిల్లా విజయ్ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భీమా కోరేగావ్ విజయోత్సవ దివస్‌ను జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1818 జనవరి 1న పూణే సమీపంలోని భీమా కోరేగావ్‌లో పెషావాలపై మహర్ రెజిమెంట్ విజయం సాధించడం ద్వారా మన నిజమైన విముక్తి ప్రారంభమైందని చెప్పవచ్చని పేర్కొన్నారు. అది పెషావాలకు, బ్రిటిష్ సైన్యానికి మధ్య జరిగిన చిన్న యుద్ధమే అయినా అది మలుపు తిరిగిందన్నారు. ఈ యుద్ధం ద్వారా అప్పటి అంటరాని వర్గాల విముక్తి కోసం 500 మంది మహర్ సైనికులు పెషావాల శక్తివంతమైన సైన్యాన్ని ఓడించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సైనికుడి కుమారుడైనందున ఈ యుద్ధం గురించి ఆయనకు బాగా తెలుసని, నివాళులు అర్పించడానికి తరచూ ఈ ప్రదేశాన్ని సందర్శించేవారన్నారు. మహర్ యుద్ధంలో అమరవీరుల గౌరవార్థం భీమా కోరేగావ్‌లోని యుద్ధ స్మారక చిహ్నంపై చెక్కబడిన అమరవీరులకు. 1818 జనవరి 1న యుద్ధ రంగంలో ప్రాణాలు కోల్పోయిన వీరజావాన్లకు వందనం అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, ఆర్ ఓబులయ్య, మాలమహనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, అంబేద్కర్ సేవాదళ్ నాయకులు మచ్చు రెడ్డయ్య, మాలమహనాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, మండల ప్రధాన కార్యదర్శి రేగంటి హరిబాబు, మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్, మండల కోశాధికారి మద్దెల బాలగంగాధర్, గుర్రం లోకనాధం, అరిపెంట ఆనంద్, మద్దెల జనార్దన్, జి.విజయ్, జి.రవీంద్రబాబు, బి.నాగార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ డాక్టర్ షేక్‌హబీబ్‌బాషా

మన కళలు, సంస్కృతిని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీలేరు పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్‌హబీబ్‌బాషా, పట్టణ సిఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు పీలేరు పట్టణంలోని విఎస్ నర్తనశాలలో దుర్గా గ్యాస్ అధినేత బి.సోమ్లా నాయక్ జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు బి.అమరేంద్ర నాయక్ జానపద సంబరాల రాత్రి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్, సిఐ మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుకోవడానికి కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విఎస్ నర్తనశాల నిర్వాహకులు వి.మయూర్‌నాథ్ శర్మ, బైరెడ్డిపల్లి కళాతరంగిణి సంస్థ నిర్వాహకులు రాజేష్, షైన్ బాబ్జాన్, పసుపులేటి వెంకటరమణ, కళాకారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్పందనకు వ్చిన అర్జీలకు సంబంధించిన పరిస్కారాలు ఎన్ని చేశారనే వివరాలతో అధికారులు రావాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెల్ విషర్స్, ఫ్రెండ్స్ టూ సపోర్ట్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ రక్త నిధి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్త నిధి కేంద్ర డాక్టర్ అమరావతి మాట్లాడుతూ రక్తదాన శిబిరంతో నూతన సంవత్సరాన్ని ఆరంభించడం శుభ పరిమాణమని తెలిపారు. యువత ప్రతి సందర్భాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. వెల్ విషర్స్ నిర్వాహకులు గిరీష్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన రోగులు దేశవ్యాప్తంగా లక్షలాది సంఖ్యలో రక్తదాతల వివరాలు కలిగిన ఫ్రెండ్స్ టూ సపోర్ట్ మొబైల్ ఆప్ మరియు వెబ్‌సైట్‌ని సందర్శించాలని తెలిపారు. ఆసక్తి గల రక్తదాతలు ఈ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రక్తదాన శిబిరంలో రక్త నిధి కేంద్ర సిబ్బంది, వెల్ విషర్స్ సభ్యులు విజయ్, రెడ్డి శేషు, మురళీకృష్ణ, హరి బాబు, జ్ఞానేంద్ర పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

బాధితునికి ఆర్థిక సాయం చేస్తున్న మహ్మద్‌ఖాన్

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణానికి చెందిన మహ్మద్ బైక్ మెకానిక్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకుకున్న వైసిపి మైనార్టీ నాయకులు బేపారి మహ్మద్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫాయాజూర్ రహమాన్ పరామర్శించారు. అతని ఆరోగ్యం కోసం ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మున్సిపల్ కౌన్సిలర్ సలీం, మైనార్టీ నాయకులు అజంతుల్లా, బేపారి జబివుల్లా, 9వ వార్డు కన్వీనర్ ఉబైదుర్ రహమాన్, దివాకర్ పాల్గొన్నారు.

జంబోరీకి ఎంపికైన విద్యార్థులు

జాతీయ జంబోరీకి కడప విద్యార్థులు

రాయచోటి: రాజస్థాన్‌లో ఈనెల 4 నుంచి 10 వరకు నిర్వహించబోయే 18వ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జాంబోరి సమ్మేళనానికి కడప నుంచి 80 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం కడప శంకరాపురంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా తరపున పాల్గొనే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. స్కౌటింగ్‌కు సంబంధించిన అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ఉత్తమ ప్రదర్శనలు కనపరిచి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రెజరర్ రమణయ్య, ఎఎస్ఒ సి. లక్ష్మీకర్, స్కౌట్ మాస్టర్లు ఖాదర్ బాషా, బాలసుందరం, గైడ్ కెప్టెన్ జయలక్ష్మి పాల్గొన్నారు.

తేక్వాండోలో విద్యార్థికి గోల్డ్ మెడల్

కడప అర్బన్: రవీంద్ర నగర్ లో ఉన్న ఎస్ ఎస్ నికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని షేక్. హరీమా సాదియా తేక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించారని కరస్పాండెంట్ ఎ. శ్రీనివాసులు తెలిపారు. మెడల్ సాధించిన విద్యార్థిని ఆదివారం కరస్పాండెంట్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఈనెల 28, 29, 30 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసులు

40 పరుగులకే కుప్పకూలిన అరుణాచల్‌ప్రదేశ్ జట్టు

ప్రజాశక్తి - కడప

కడపలోని వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఆదివారం నుంచి అండర్ 25 మెన్ సి.కె నాయుడు ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ప్రారంభ మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు ఆంధ్ర బౌలర్ల దాటికి నిలువలేకపోయింది. మొదటి ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లలో 40 పరుగులకు ఆల్‌ఔట్ అయింది. ఆ జట్టులోని దాదో టాచుంగు 9, మాగుంగు 8 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని ఎం. ఆంజనేయులు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు, సాకేత్రామ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 264 పరుగులు చేసింది. ఆ జట్టులోని టి. వంశీకృష్ణ 127 (నాట్ అవుట్), ఎం. మహి కుమార్ 126 (నాట్ అవుట్) పరుగులు చేశారు. అరుణాచల్ ప్రదేశ్ జట్టులోని యోర్ జూమ్ ఒక వికెట్ తీసుకున్నారు.

కొత్త సంవత్సరంలో సందడి కరువు

- 40 శాతంపైగా పడిపోయిన విక్రయాలు
- కరోనా, తుపాన్, అధిక వర్షాల ప్రభావం
- సాంస్కృతిక ప్రదర్శనలూ కరువు

నూతన సంవత్సర వేడుకల సందడి మందగించింది. కరోనా మహమ్మారి, మాండూస్ తుపాన్ బీభత్సం, అధిక వర్షాల ప్రభావం కారణమని తెలుస్తోంది. ప్రతి ఏటా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కోట్లాది రూపాయల వ్యాపారాలు సాగేవి. ప్రస్తుతం నూతన సంవత్సరాన్ని పరిశీలిస్తే సుమారు 50 శాతం వరకు క్రయవిక్రయాలు పడిపోయినట్లు కనిపిస్తోంది. అధిక వర్షాల కారణంగా సాగు చేసిన శనగ పంట పనికి రాకుండా పోవడంతో దున్నేయాల్సి రావడం, పత్తి, పసుపు ధరలు అమాంతం పడిపోవడం, మాండూస్ తుపాన్ విజృంభణ వంటి కారణాలతో కొనుగోలు శక్తి సన్నగిల్లినట్లు కనిపిస్తోంది. కరోనా విజృంభణకు ముందు హైదరాబాద్, తిరుపతి నుంచి కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం తెలిసిందే. ఈ ఏడాది అటువంటి దాఖలాలు కనిపించకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో నూతన సంవత్సర వేడుకల ఆనవాళ్లే కనిపించలేదు. సాధారణంగా తిను బండారాల విక్రయాలు మొదలుకుని వైన్స్, విం దులు, వినోదాల సందడి నెలకొనేది. కేక్‌లు, పూలు, పూల బొకేల వ్యాపారాలు జోరుగా సాగేది. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సాగిన వ్యాపారాల తీరును పరిశీలిస్తే మూడేళ్ల కింద నూతన సంవత్సరం సందర్భంగా కడప పట్టణంలో ఒక్కో వ్యాపారికి పూలు, బొకేలన్నీ కలిపి రూ.1.20 లక్షలు వ్యాపారం సాగడం తెలిసిందే. ఈ ఏడాది రూ.50 వేల దిగువకు పడిపోయిందని వ్యాపారులు వాపోవడం గమనార్హం. ఇదేతరహాలో వస్త్ర దుకాణాల్లో సందడి సైతం అంతంత మాత్రమే కనిపించింది. కడప నగరాన్ని పరిశీలిస్తే ప్రతి కూడలిలోనూ గుడారాలు వేసి నూతన సంవత్సర కేకులు, బొకేలు విక్రయించడం తెలిసిందే. ఈ ఏడాది నూతన సంవత్సర కేకుల, బొకేలు గుడారాలు అరుదుగానే కనిపించకపోవడం గమనార్హం. ఇటీవల జిల్లాలో మాండుస్ తుపాన్ బీభత్సం, ఖరీఫ్, రబీ సీజన్ల వర్ష పాతం వివరాలను పరిశీలిస్తే అధిక వర్షాలు నమోదు కారణమని తెలుస్తోంది. సాధారణ పంటలతో పాటు ఉద్యాన రైతులూ భారీ నష్టపోవడం తెలిసిందే. ఫలితంగానే నూతన సంవత్సర వేడుకల శోభ తగ్గినట్లు కని పించింది. తాజాగా కరోనా వేరియంట్ విస్తరిస్తోందనే భయంతో రక్షణా త్మక వాతావరణం కనిపించింది. మద్యం ప్రియులు డిసెంబర్ 31 రాత్రే కొనుగోలు చేసుకుని ఇళ్లకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. వస్త్ర వ్యాపారం, మద్యం వ్యాపారం మినహా మిగిలిన వ్యాపార కార్యకలాపాలు మందగించినట్లు కనిపిస్తోంది. ప్రతియేటా జిల్లాలోని యువత కేరింతలు కొడుతూ బైక్‌లపై రయ్‌మని వెళ్తున్న ప్రమాదకర విన్యాసాలను పోలీసులు కూడళ్లలో తనిఖీల పేరుతో అడ్డుకోవడం ఉపశమనాన్ని కలిగించింది. 2022 సంవత్సరానికి గుడ్‌బై చెప్పి నూతన సంవత్సరాన్ని స్వాగతించిన నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకునే వరకు పరిమితం కావడం గమనార్హం.

తగ్గిన కేక్‌ల విక్రయం

ఏటా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సుమారు రూ.మూడు నుంచి రూ.ఐదు కోట్ల మేరకు విక్రయాలు సాగుతుండేవి. కరోనా విజృంభణ దగ్గర నుంచి కేక్‌ల వ్యాపారానికి గండి పడింది. సుమారు 50 శాతం మేరకు విక్ర యాలు తగ్గుముఖం పట్టినట్లు అంచనా. జిల్లా కేంద్రంలోని నాగరాజుపేట, మురళీ థియేటర్, అప్సర థియేటర్ ప్రాంతాల్లోని రహదారులను ఆను కుని తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి భారీగా విక్రయాలు నిర్వహించేవారు. ప్రస్తుతం కడపకెఫే, పద్మావతి, మయూరా, పుష్పగిరి సర్కిల్, వైవిస్ట్రీట్ వంటి ప్రాంతాలకు వ్యాపారం పరిమితమైంది.

సాంస్కృతిక ప్రదర్శనలు నిల్

జిల్లాలో సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణ కరువైంది. 2018లో కడప, ప్రొద్దుటూరు పట్ట ణాల్లో హైదరాబాద్‌కు జబర్దస్త్, శిల్పారామంలో కళాకారులు తమ విన్యాసాలతో అలరించడం తెలిసిందే. మూడేళ్లుగా అటువంటి సాంస్కృతిక విన్యాసాల ఛాయలు కనిపించకపోవడం గమనార్హం. ఏదేమైనా మూడేళ్లుగా కొనసాగుతున్న కరోనా, అధిక వర్షాలు, మాండూస్ ధాటికి సందడి నామమాత్రంగా మారిందనడంలో సందేహం లేదు.

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం

నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ గిరీష

అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ గిరీష

ఎస్‌పి హర్షవర్ధన్‌రాజుకు పూలకుండీ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కలిసికట్టుగా పని చేద్దామని అధికారులను కలెక్టర్ గిరీషా పిలుపునిచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పూల మొక్కలు, పండ్లను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా నూతన సంవ త్సరంలో జిల్లా అభివృద్ధి, ప్రజల మన్ననలు పొందేందుకు సమిష్టిగా నూతనోత్తేజంతో పనిచేద్దామని పేర్కొ న్నారు. కలిసి మెలిసి కనివిని ఎరుగని విజయాలు సాధిద్దామని పిలుపు నిచ్చారు. కలెక్టర్ ను కలసిన వారిలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు మురళి, రంగస్వామి, కలెక్ట రేట్ ఎఒ బాలకృష్ణ, కలెక్టరేట్ రెవిన్యూ సిబ్బంది, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్‌కుమార్, గృహనిర్మాణ శాఖ పీడీ శివయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామ హేశ్వరమ్మ, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజు, ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి :** నూతన సంవత్సరం పురస్క రించుకొని కలెక్టర్ గిరీషా, ఎస్‌పి హర్షవర్ధన్ రాజు లను జిల్లా సమాచార ,పౌరసంబందల శాఖ అధికారి భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్‌ఒ పురుషోత్తం, పిఆర్‌ఒ ధర్మ నాయక్, ఎఇఇ నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా, సమాచార శాఖ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. **రాయచోటి :** కలెక్టర్ గిరీషా, ఎస్‌పి హర్ష వర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయాలను వేరువేరుగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మర్యాద పూర్వ కంగా కలిసి పూల మొక్క, పండ్లను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, గాలివీడు ఎంపిపి, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి కలెక్టర్, ఎస్‌పి, జేసిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. **నందలూరు**: నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయనపల్లి ఆదినా రాయణ, నాగేంద్ర, శంకర, నరసిం హారెడ్డి, నాగే శ్వర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, అక్కి వెంకట రమణ, మట్టిబాబు, తుమ్మది శివకుమార్, అబ్బాస్ పాల్గొన్నారు. **ఎమ్మెల్యే మేడాకు శుభాకాంక్షలు..**మండల పరిధిలోని బోయినపల్లిలో ఎమ్మెల్యే మేడా మల్లి కార్జునొడ్డిని సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలసి నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. **కలకడ** :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి మండలం లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, మండల మైనార్టీ అధ్యక్షులు కరిముల్లా భాష , జాఫర్ హుస్సేన్, ఖదీ మ్‌బాషాఅలీ, జాఫర్‌అలీ, ఇమ్రాన్, ఇర్ఫాన్, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు. **కలకడ:** నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలా డాయి. మండలం లోని దేవళంపేట కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం, గుట్టపల్లి, బాటవా రిపల్లె ఆంజనేయ స్వామి ఆలయాలలో, కోనలో వెలిసి నచౌడేశ్వరిదేవిఆలయం, గోపాలపురం ఉన్న షిరిడి సాయి బాబా ఆలయం, ఎల్లం గుడిబండ సమీపంలో ఉన్న శివాల యంలో భక్తులు దర్శనం చేసుకుని నూతన సంవత్సర శుభాకాం క్షలు తెలుపుకున్నారు. సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు ముస్తాబు అయినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. **వాల్మీకిపురం :** వాల్మీకి పురంలోని వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్య కర్తలు, అధికారులు, ప్రజల సమక్షంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి అంద రికి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. **రాజంపేట అర్బన్ :** పట్టణం లోని టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను పట్టణ అధ్యక్షులు కే.రామ్మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా టూవీలర్ మెకానిక్ లు కేకులు కట్ చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అసోసియేషన్ సెక్రటరీ ఎస్ అబ్దుల్ గపూర్, ట్రెజరీ ఏ హరినాథ్, ఉపాధ్యక్షులు కే రవి బాబు, ఎస్ అమీర్, ఎస్ నజీర్, ఈసీ మెంబర్ ఏ సుబ్బరాజు, కార్యవర్గ సభ్యులు టి.మహేంద్ర, ఎం బాలాజీ, ఎస్ మా భాష, అజీస్, షఫీ, ఎస్ రఫీ, జిలాని, సాయి, నెల్లూరు భాష తదితరులు పాల్గొన్నారు. **కలికిరి :** నూతన సంవత్సర వేడుకలు కలికిరి మండలం లో ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హనీఫ్ ఆధ్వర్యంలో నల్లరి కిషోర్ కుమార్ రెడ్డి నివాసంలో 25 కేజీల భారీ కేక్ కట్ చేసి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ జెఎసి సభ్యులు ఇర్ఫాన్, ఖాదర్ వల్లి, జావిద్, మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు సహదేవరెడ్డి, వెంకట రమణారెడ్డి, యర్రంరెడ్డి, ఆగస్తేశ్వర్, వర్మ, ముస్లిం మైనారిటీ నాయకులు వైజాగ్‌బాషా, మోహన్ కార్యకర్తలు పాలొ న్నారు. **పుల్లంపేట :** నూతన సంవత్సరం పురస్క రించుకొని ఆదివారం కలెక్టర్ గిరీష జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా కలెక్టర్ సభా భవనం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ డైరీ-2023 క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో తహాశీల్దార్ నరసింహ కుమార్, ఆర్ఐ నవీన్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డిని బి.కొత్త కోట వైసిపి నాయకులు పూల బుకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కార్య క్రమంలో హౌసింగ్ సొసైటీ చైర్మన్ కంచి బలరాం రెడ్డి, ప్రభుత్వఆస్పత్రి కమిటీడైరెక్టర్ కంచికళ్యాణ్ కుమార్‌రెడ్డి, వైసిపి జిల్లాప్రచార కార్యదర్శి అయూబ్ బాషా,పవన్, ప్రమోద్‌సాయి, మాజీ సర్పంచ్ మియాతన్వీర్ పాల్గొన్నారు. **కలికిరి :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి నందు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, ఎపిఎండిసిడైరెక్టర్ హరీశ్‌రెడ్డికి స్థానిక వైసిపి నాయకులు, జిల్లా ఎస్‌సిసెల్ కార్యదర్శి వీహరి ఆధ్వర్యంలో దుశ్శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ యువనాయకులు వేంపల్లి ఫయాజ్, బావాజీ మేస్త్రీ రామ రెడ్డప్ప, సహదేవ, డ్రైవర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేడాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఎమ్మెల్యే రామచంద్రారెడ్డికి ఫలహారాలు అందిస్తున్న మహిళలు

మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

మసీదు అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మంగంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఈద్గాకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా మూడు లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర నాయకులు ముక్కారూపానందరెడ్డి మంగంపేట మైనార్టీ ముస్లింలకు అందజేశారు. గుంతకల్లు రైల్వే బోర్డు సభ్యులు తల్లం భరత్‌కుమార్‌రెడ్డి గజమాలతో ముక్కారూపానందరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈద్గా నిర్మాణం కొరకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మసీదులో ముక్కారూ పానం దరెడ్డిని శాలువాతో మైనార్టీ సోదరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కా మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కాసాయి వికాస్‌రెడ్డి, స్థానిక నాయకులు తల్లంరమణారెడ్డి, పులపత్తూరి రామసుబ్బారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి ఉపసర్పంచ్ కౌలూరు మధు సూదన్ రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ మెంబర్ అన్వర్ భాష, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, మైనార్టీ నాయకులు ముజీబ్ ఎస్ఎ.సలాం కులాయప్ప, రహీం, అబ్దుల్లా జిలాని, మంగంపేట సర్పంచ్ మినుకు సుధాకర్ గుంతకల్లు తల్లెం చంద్రమోహన్ రెడ్డి ,కౌలూరు సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత

ప్రజాశక్తి -కలకడ

మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ చలమయ్యగారిపల్లికి చెందిన శ్రీకృష్ణ గత కొన్ని సంవత్సరములుగా కంటి చూపు లేకుండా కటిక పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నాడు. అదే పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు తన ఉదార స్వభావాన్ని చాటుకున్నాడు .శ్రీకృష్ణ, దగ్గుపాటి వెంకటేశ్వరరావులు 1987 సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ స్నేహితులుగా ఉండేవారు. సాటి స్నేహితుడి పేదరికం గుర్తించిన వెంకటేశ్వరరావు పదివేల రూపాయల నగదును అందించి తన స్నేహ భావాన్ని చాటుకున్నారు.

ఘనంగా రమణ మహర్షి 143వ జయంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నదానం చేస్తున్న దాతలు

పట్టణంలోని గ్రంధాలయం వద్ద రమణ మహర్షి 143వ జయంతిని సందర్భంగా అరుణాచల శ్రీ భగవాన్ రమణమహర్షి భక్తబృంద సభ్యుల ఆధ్వ ర్యంలో మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. రమణ మహర్షి భక్త బృందం వారు మాట్లా డుతూ ఏడేళ్లుగా పట్టణంలో మహర్షి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్త బృంద సభ్యులు, రాజంపేట పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

వెలిగల్లు ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడితో వెలిగల్లు రిజర్వాయర్ పార్కు గండిమడుగు జన రద్దీతో ఆదివారం నిండిపోయింది. కొత్త సంవత్సరం కావడంతో జిల్లా చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేకమంది కుటుంబ సమేతంగా రావడంతో సందడి నెలకొంది. వెలిగల్లు రిజర్వాయర్ నుంచి పాపాఘ్ని నదిలోకి ఒక గేటు ద్వారా పోతున్న నీటిని తిలకించారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై వెలగల్లు రిజర్వాయర్ నిర్వహించడంతో రోడ్డుపైనే వాహనాలు పర్యటకుల సందడి పెరిగిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకట శివకు మార్ పర్య వేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సందడిగా మారిన వెలిగల్లు రిజర్వాయర్ పార్కు

సర్టిఫికెట్‌ను అందుకొంటున్న మిట్స్ ప్రిన్సిపల్ యువరాజ్

మిట్స్ కళాశాలకు ట్రిపుల్ 'ఎ' రేటింగ్

ప్రజాశక్తి-కురబలకోట

మండలంలోని మిట్స్ కళాశాలకు జాతీయ స్థాయిలో ట్రిపుల్ ఎ రేటింగ్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ లెర్నింగ్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో స్వయం అను పేరుతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ కు ఆన్లైన్ పరిక్షలో ర్యాంకులో రాష్ట్రవ్యాప్తంగా మొదటి ర్యాంకు, దేశవ్యాప్తంగా ఆరో ర్యాంక్ సాధించిందని ఆయన తెలిపారు. జూలై-డిసెంబర్ 2022 సెషన్‌లో 3270 మంది రిజిస్టర్ చేసుకోగా ఇందులో 1349 మంది ఎలైట్ లోను, 667 మంది సిల్వర్ లోను, 19 మంది గోల్డ్ లోను, 766 సక్సెసఫుల్ లోను, 98 మంది కంప్లీట్ లోను సర్టిఫికెట్‌లు పొందారని ఆయన అన్నారు. ఈ ఘనత సాధిచడానికి కృషిచేసిన విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ విజయభాస్కర్ చౌదరి, ఇడి కీర్తి నాదెళ్ల కృతజ్ఞతలు తెలిపారు.

పింఛను పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం

ప్రజాశక్తి - చాపాడు

లక్ష్మీపేటలో పింఛను పంపిణీ చేస్తున్న ఎంపిపి

ఎన్నికలల్లో సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల డబ్బు పెంపు హామీని నెరవేర్చారని ఎంపిపి టి. లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట, ఖాదర్‌పల్లె గ్రామాల్లో కొత్తగా మంజూరైన రూ.2,750 పెరిగిన పింఛను డబ్బులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పింఛను పెంచి ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, లక్మీపేట సర్పంచు శ్రీ విద్య, షమీంబాను, కన్వీనర్ చంద్ర మోహన్‌రెడ్డి, జైనుల్లా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రక్తదానం చేస్తున్న నిఖిల్

ప్రాణాలను కాపాడే రక్తదానం మహా దానమని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బైసానిసత్య నారాయణ పేర్కొన్నారు. మండ లం లోని చిలంకూరు గ్రామానికి చెందిన హెప్సీ అను మహిళకు రక్తం అవసరం కాగా సంస్థ సభ్యులు నిఖిల్ (బిట్టు) రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సత్య నారాయణ ఆదివారం మాట్లాడుతూ బాధిత మహిళ స్థానిక సంధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతూ డాక్టర్ సలహా మేరకు బి-పాజిటివ్ రక్తం అవసరమైందన్నారు. బాధిత మహిళ కుటుంబికులు ఈ సమాచారాన్ని తమ సంస్థకు ఇచ్చారన్నారు. తాను అడిగిన వెంటనే నిఖిల్ రక్తదానం చేసేందకు ముందుకు వచ్చారన్నారు. రక్తదాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాధవ, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు.. తప్పని తిప్పలు

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రమైన కొండాపురంలో సిఎంఆర్ కాలనీలో ఉన్న రోడ్డుపై నిత్యం జన సంచారం అధికంగా ఉం టుంది. కొండాపురం పాత బస్టాండ్ ప్రాంతంలోని ప్రజలు సిఎంఆర్ కాలనీ ప్రజలు జాతీయ రహ దారిపైకి వెళ్లాలంటే ఇదే ఏకైక రహదారి. ఈ రహదారి పైకి చుట్టుపక్కల నివాస గృహాల వారు మురికి నీటిని, స్నానపు నీటిని, వృథాగా వదిలే కుళాయిలన నీటిని ప్రధాన రహదారిపైకి వదిలి వదులుతున్నారు. ఆ దారిలో తిరిగే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి గుంతలు ఏర్పాటు చేసుకోకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

జిజిహెచ్‌కు స్కానింగ్ కష్టాలు!

- రేడియాలజిస్టుల కొరతతో రోగులు విలవిల
- వారాల తరబడి తప్పని నిరీక్షణ
- ప్రయివేటుకు రోగుల పరుగులు
- పాలక మండలికి పట్టని వైనం

సిటిస్కాన్ కోసం వేచివున్న రోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని స్కానింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. దేశంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద ప్రభుత్వాస్పత్రిగా గుర్తింపు పొందిన ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్కానింగ్ సేవలు అధ్వానానికి కేరాఫ్‌గా మారాయని చెప్పవచ్చు. రేడియాలజీ వైద్యుల నియామకంలో ఉన్నతాధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యమే రోగుల పాలిటశాపంగా మారింది. వీరి నిర్వాకం కడప పట్టణంలోని ప్రయివేటు స్కానింగ్ కేంద్రాలకు వరంగా మారిందని చెప్ప వచ్చు. ప్రతి రోజూ జిల్లా కేంద్రంలోని జిజిహెచ్‌లో ఒపికి 1400 నుంచి 1600 మంది, ఐపి రోగులు 650 మందికిపైగా వైద్యసేవలు పొందుతున్న సంగతి తెలిసిందే. రోజుకు 40 మంది నుంచి 68 మందికి సిటిస్కాన్, సుమారు 40 మంది వరకు డెలివరీ స్కానింగ్ పరీక్షలు చేయాల్సి వస్తోంది. ప్రతి రోజూ ఒపి, ఐపి హాజరు, సిటీ స్కానింగ్, డెలివరీ స్కానింగ్ కేంద్రాల దగ్గర ఉన్న రోగుల రేషియో ఆధారంగా స్కానింగ్ వచ్చే రోగుల రేషియోను బట్టి రేడి యాలజీ వైద్యు లను షిఫ్టులుగా నియమించాల్సి ఉంది. ఇటువంటి శాస్త్రీయ విధానాన్ని అవలంభించకపోవడంతో స్కానింగ్ రోగులకు ఐదు నుంచి వారం రోజుల వరకు గడువు ఇస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటున్న పలువురు రోగులు ప్రయివేటు స్కానింగ్ కేంద్రాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రయివేటు స్కానింగ్ కేంద్రాల్లో ఒక్కో స్కానింగ్‌కు ఒక్కో రకమైన ఫీజులు వసూలు చేస్తుండడం గమనార్హం. ఇందులోభాగంగా పట్టణంలోని ఎర్రముక్కపల్లి, జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ప్రయివేటు స్కానింగ్ సెంటర్లను పలువురు రోగులు ఆశ్రయించాల్సి వస్తోంది. ఇక్కడ స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు స్కానింగ్ చేయడానికి రూ.3,670 నుంచి రూ.ఏడు వేల వరకు వసూలు చేస్తుండడం ఆందోళకలిగిస్తోంది. జిజిహెచ్ ఉన్న తాధికారులు, పాలకవమండలి నిర్లక్ష్యం కారణంగా సామాన్యులు నిలువుదోపిడీకి గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్కానింగ్ కేంద్రాలు ఉన్నప్పటికీ పాలనా వైఫల్యం కారణంగా రోగులు ఆర్థిక ఇక్కట్లకు గురవుతున్నారు. జిల్లా ప్రభుత్వ సర్వజనా స్పత్రిలోనే ఇటువంటి పరిస్థితులు ఉంటే మిగిలిన 11 కమ్యూనిటీ ఆస్పత్రులు, జిల్లాస్థాయి ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో ఎటువంటి పరిస్థితులు ఉంటాయో ఆలోచించాల్సి ఉంది. గతేడాది జిజిహెచ్ బాధ్యతలను పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్, జిజిహెచ్ అడ్మినిస్ట్రే టివ్ ఆఫీసర్ ధ్యాన్‌చంద్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒపి సేవల సదుపాయాన్ని కొనసాగించేలా చేసి, ఎటువంటి స్కానింగ్ సమ స్యలు ఎదురవకుండా చూసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత జిజి హెచ్ పర్యవేక్షణ ఉన్నతాధికారి గత జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ తరహా పనితీరును కనబరిస్తే సామాన్యుల ఇబ్బందులను పరిష్కరిం చినవారవుతారనడంలో సందేహం లేదు. దీనిపై జిజిహెచ్ సూపరి ంటెండెంట్ వెంకటేశ్వర్లను సంప్రదించగా అత్యవసర రోగులకు, అడ్మి షన్ రోగులకు స్కానింగ్ పరీక్షలు చేస్తున్నామని, రేడియాలజీ వైద్యుడు ఒక్కరే కావడంతో స్కానింగ్ పరీక్షలు చేయడానికి గడువులు ఇవ్వాల్సి వస్తుండడం వాస్తవమేనని పేర్కొనడం గమనార్హం.

ధాన్యం నిలువకు సరిపడ గోదాములేవీ..?

- గిట్టుబాటు ధర వచ్చే వరకూ ధాన్యం ఉంచుకునేందుకులేని అవకాశం.. పొలాల్లో అమ్మకాలకే ప్రాధాన్యం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పండించిన వరి ధాన్యం నిల్వ ఉంచు కునేందుకు సరిపడ గోదాములు అందుబాటులో లేవు. దీంతో పంట నూర్పిడి చేయగానే రైతులు ఉన్న ధరకే ఉత్పత్తులను అమ్ముకోవాల్సిన పరిస్థితి. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో ఖాజీపేటలో 4,200 హెక్టార్లు, మఠం మండలంలో 5,500 హెక్టార్లు, దువ్వూరులో 3,515 హెక్టార్లలో, చాపాడులో 6,020, మైదుకూరులో 2,070 హెక్టార్లలో వరి పైరును రైతులు సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 53 వేల ఎకరాల్లో వరి పైరు సాగైంది. ఎకరాకు 30 బస్తాల వంతున దిగుబడి వచ్చిన ప్పటికీ 17 లక్షల బస్తాలకు పైగా దిగుబడి వచ్చింది. 14 ప్రయివేటు, 2 మార్కెట్ యార్డ్ వారి వరి ధాన్యం నిల్వ గోదాములు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మఠం మండల పరిధిలో వరి ధాన్యం నిల్వ గోదాములు అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న వాటిలో 3.50 లక్షల బస్తాల నుంచి నాలుగు లక్షల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. మిగిలిన వరి ధాన్యాన్ని నిలువ చేసుకునే అవ కాశాలు లేవు. ఈ పరిస్థితుల్లో పొలాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి సచివాలయ పరిధిలో గోడౌన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు నిలువ చేసుకునే వెసులుబాటు ఉండడం లేదు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ప్రయివేట్ రంగంలో కూడా గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రస్తుతం 8 బస్తాల ధర రూ.12వేలు ఉంది. 2021 డిసెంబర్‌లో 8 బస్తాల ధర రూ.9వేల లోపు ఉండేది. ఇవి ఆగస్టు నెలకు రూ.18వేలకు చేరు కున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. అదే నిలువకు అవకాశం ఉంటే గిట్టు బాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉండేది. ప్రభుత్వం నూతనంగా కొన్ని గ్రామాలను ఎంపిక చేసి గోడౌన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడు తోంది. తహాశీల్దార్లు ఖాళీ ప్రదేశాలను గుర్తించి సమాచారాన్ని ఆర్‌డిఒకు పంపారు. వచ్చే ఏడాదికైనా గ్రామాల్లో గౌడౌన్‌లను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

కుమ్మరకొట్టాల వద్దనున్న గోడౌన్

ధాన్యం నిలువకు అవకాశం లేదు

అయిదెకరాల్లో వరి పంటను సాగు చేశాను. ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో పంట పొలాల్లో వరి ధాన్యాన్ని అమ్మకం చేపడుతున్నాం. రైతులు నిలువ ఉంచు కునేందుకు అవసరమైన గోదాములు అందు బాటులో ఉంటే.. గిట్టుబాటు ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది

- వెంకట సుబ్బయ్య, రైతు, సోమాపురం ఎస్‌సి కాలనీ

గోడౌన్‌లను ఏర్పాటు చేస్తే ఉపయోగం

గ్రామాల్లో గోడౌన్లను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం గోడౌన్‌లు సమీపంలో అందుబాటులో లేక పోవ డంతో ఇతర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించాల్సి వస్తుంది. చాలామంది రైతులు నిలువ ఉంచేందుకు అవకాశం లేక పంట పొలాల్లోనే అమ్మకాలు చేప డుతున్నారు.

- శీను, రైతు, లక్ష్మీపేట

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- కలకడ

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా ఇరువురికి గాయాలు కాగా కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.కె.వి పల్లి మండలం గ్యారంపల్లి పంచాయతీ రామారావు పల్లె నుండి రెడ్డప్ప బావమరిది, అతని సోదరుడు నవీన్ కుమార్, ప్రవీణ్ కుమారులు తమ ద్విచక్ర వాహనంలో కలకడలో ఉన్న చర్చి లో ప్రార్థనలకు వెళుతున్నారు. కలకడ నుండి కలికిరి వైపు అమీరుల్లా అనే యువకుడు తన ద్విచక్ర వాహనంలో అతివేగంగా వస్తూ బాటవారిపల్లి సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న పెట్రోలు బంకు వద్ద నవీన్, ప్రవీణ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ప్రమాదంలో నవీన్ కుమార్, ప్రవీణ్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. క్రమంలో రెడ్డప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు నిర్వహించారు. ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు పేకాట నిర్వహణపై అందిన ముందస్తు సమాచారం మేరకు పట్టణం సమీపంలోని పిటియం రోడ్డులోని చింతతోపు వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ.7,340 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ విజయ్, కానిస్టేబుల్ నాగేంద్ర, లక్ష్మీనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

అరెస్టయిన పేకాట రాయుళ్లతో పోలీసులు

కొత్త సంవత్సరంలో సందడి కరువు

- 40 శాతంపైగా పడిపోయిన విక్రయాలు
- కరోనా, తుపాన్, అధిక వర్షాల ప్రభావం
- సాంస్కృతిక ప్రదర్శనలూ కరువు

నూతన సంవత్సర వేడుకల సందడి మందగించింది. కరోనా మహమ్మారి, మాండూస్ తుపాన్ బీభత్సం, అధిక వర్షాల ప్రభావం కారణమని తెలుస్తోంది. ప్రతి ఏటా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కోట్లాది రూపాయల వ్యాపారాలు సాగేవి. ప్రస్తుతం నూతన సంవత్సరాన్ని పరిశీలిస్తే సుమారు 50 శాతం వరకు క్రయవిక్రయాలు పడిపోయినట్లు కనిపిస్తోంది. అధిక వర్షాల కారణంగా సాగు చేసిన శనగ పంట పనికి రాకుండా పోవడంతో దున్నేయాల్సి రావడం, పత్తి, పసుపు ధరలు అమాంతం పడిపోవడం, మాండూస్ తుపాన్ విజృంభణ వంటి కారణాలతో కొనుగోలు శక్తి సన్నగిల్లినట్లు కనిపిస్తోంది. కరోనా విజృంభణకు ముందు హైదరాబాద్, తిరుపతి నుంచి కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం తెలిసిందే. ఈ ఏడాది అటువంటి దాఖలాలు కనిపించకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో నూతన సంవత్సర వేడుకల ఆనవాళ్లే కనిపించలేదు. సాధారణంగా తినుబండారాల విక్రయాలు మొదలుకుని వైన్స్, విందులు, వినోదాల సందడి నెలకొనేది. కేక్‌లు, పూలు, పూల బొకేల వ్యాపారాలు జోరుగా సాగేది. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సాగిన వ్యాపారాల తీరును పరిశీలిస్తే మూడేళ్ల కింద నూతన సంవత్సరం సందర్భంగా కడప పట్టణంలో ఒక్కో వ్యాపారికి పూలు, బొకేలన్నీ కలిపి రూ.1.20 లక్షలు వ్యాపారం సాగడం తెలిసిందే. ఈ ఏడాది రూ.50 వేల దిగువకు పడిపోయిందని వ్యాపారులు వాపోవడం గమనార్హం. ఇదేతరహాలో వస్త్ర దుకాణాల్లో సందడి సైతం అంతంత మాత్రమే కనిపించింది. కడప నగరాన్ని పరిశీలిస్తే ప్రతి కూడలిలోనూ గుడారాలు వేసి నూతన సంవత్సర కేకులు, బొకేలు విక్రయించడం తెలిసిందే. ఈ ఏడాది నూతన సంవత్సర కేకుల, బొకేలు గుడారాలు అరుదుగానే కనిపించకపోవడం గమనార్హం. ఇటీవల జిల్లాలో మాండుస్ తుపాన్ బీభత్సం, ఖరీఫ్, రబీ సీజన్ల వర్ష పాతం వివరాలను పరిశీలిస్తే అధిక వర్షాలు నమోదు కారణమని తెలుస్తోంది. సాధారణ పంటలతో పాటు ఉద్యాన రైతులూ భారీ నష్టపోవడం తెలిసిందే. ఫలితంగానే నూతన సంవత్సర వేడుకల శోభ తగ్గినట్లు కనిపించింది. తాజాగా కరోనా వేరియంట్ విస్తరిస్తోందనే భయంతో రక్షణాత్మక వాతావరణం కనిపించింది. మద్యం ప్రియులు డిసెంబర్ 31 రాత్రే కొనుగోలు చేసుకుని ఇళ్లకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. వస్త్ర వ్యాపారం, మద్యం వ్యాపారం మినహా మిగిలిన వ్యాపార కార్యకలాపాలు మందగించినట్లు కనిపిస్తోంది. ప్రతియేటా జిల్లాలోని యువత కేరింతలు కొడుతూ బైక్‌లపై రయ్‌మని వెళ్తున్న ప్రమాదకర విన్యాసాలను పోలీసులు కూడళ్లలో తనిఖీల పేరుతో అడ్డుకోవడం ఉపశమనాన్ని కలిగించింది. 2022 సంవత్సరానికి గుడ్‌బై చెప్పి నూతన సంవత్సరాన్ని స్వాగతించిన నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకునే వరకు పరిమితం కావడం గమనార్హం.

తగ్గిన కేక్‌ల విక్రయం

ఏటా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సుమారు రూ.మూడు నుంచి రూ.ఐదు కోట్ల మేరకు విక్రయాలు సాగుతుండేవి. కరోనా విజృంభణ దగ్గర నుంచి కేక్‌ల వ్యాపారానికి గండి పడింది. సుమారు 50 శాతం మేరకు విక్రయాలు తగ్గుముఖం పట్టినట్లు అంచనా. జిల్లా కేంద్రంలోని నాగరాజుపేట, మురళీ థియేటర్, అప్సర థియేటర్ ప్రాంతాల్లోని రహదారులను ఆనుకుని తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి భారీగా విక్రయాలు నిర్వహించేవారు. ప్రస్తుతం కడపకెఫే, పద్మావతి, మయూరా, పుష్పగిరి సర్కిల్, వైవిస్ట్రీట్ వంటి ప్రాంతాలకు వ్యాపారం పరిమితమైంది.

సాంస్కృతిక ప్రదర్శనలు నిల్

జిల్లాలో సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణ కరువైంది. 2018లో కడప, ప్రొద్దుటూరు పట్టణాల్లో హైదరాబాద్‌కు జబర్దస్త్, శిల్పారామంలో కళాకారులు తమ విన్యాసాలతో అలరించడం తెలిసిందే. మూడేళ్లుగా అటువంటి సాంస్కృతిక విన్యాసాల ఛాయలు కనిపించకపోవడం గమనార్హం. ఏదేమైనా మూడేళ్లుగా కొనసాగుతున్న కరోనా, అధిక వర్షాలు, మాండూస్ ధాటికి సందడి నామమాత్రంగా మారిందనడంలో సందేహం లేదు.

జిజిహెచ్‌కు స్కానింగ్ కష్టాలు!

- రేడియాలజిస్టుల కొరతతో రోగులు విలవిల
- వారాల తరబడి తప్పని నిరీక్షణ
- ప్రయివేటుకు రోగుల పరుగులు
- పాలక మండలికి పట్టని వైనం

సిటీ స్కానింగ్ వద్ద వేచి ఉన్న రోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని స్కానింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. దేశంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద ప్రభుత్వాస్పత్రిగా గుర్తింపు పొందిన ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్కానింగ్ సేవలు అధ్వానానికి కేరాఫ్‌గా మారాయని చెప్పవచ్చు. రేడియాలజీ వైద్యుల నియామకంలో ఉన్నతాధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యమే రోగుల పాలిటశాపంగా మారింది. వీరి నిర్వాకం కడప పట్టణంలోని ప్రయివేటు స్కానింగ్ కేంద్రాలకు వరంగా మారిందని చెప్ప వచ్చు. ప్రతి రోజూ జిల్లా కేంద్రంలోని జిజిహెచ్‌లో ఒపికి 1400 నుంచి 1600 మంది, ఐపి రోగులు 650 మందికిపైగా వైద్యసేవలు పొందుతున్న సంగతి తెలిసిందే. రోజుకు 40 మంది నుంచి 68 మందికి సిటిస్కాన్, సుమారు 40 మంది వరకు డెలివరీ స్కానింగ్ పరీక్షలు చేయాల్సి వస్తోంది. ప్రతి రోజూ ఒపి, ఐపి హాజరు, సిటీ స్కానింగ్, డెలివరీ స్కానింగ్ కేంద్రాల దగ్గర ఉన్న రోగుల రేషియో ఆధారంగా స్కానింగ్ వచ్చే రోగుల రేషియోను బట్టి రేడియాలజీ వైద్యులను షిఫ్టులుగా నియమించాల్సి ఉంది. ఇటువంటి శాస్త్రీయ విధానాన్ని అవలంభించకపోవడంతో స్కానింగ్ రోగులకు ఐదు నుంచి వారం రోజుల వరకు గడువు ఇస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటున్న పలువురు రోగులు ప్రయివేటు స్కానింగ్ కేంద్రాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రయివేటు స్కానింగ్ కేంద్రాల్లో ఒక్కో స్కానింగ్‌కు ఒక్కో రకమైన ఫీజులు వసూలు చేస్తుండడం గమనార్హం. ఇందులోభాగంగా పట్టణంలోని ఎర్రముక్కపల్లి, జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ప్రయివేటు స్కానింగ్ సెంటర్లను పలువురు రోగులు ఆశ్రయించాల్సి వస్తోంది. ఇక్కడ స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు స్కానింగ్ చేయడానికి రూ.3,670 నుంచి రూ.ఏడు వేల వరకు వసూలు చేస్తుండడం ఆందోళకలిగిస్తోంది. జిజిహెచ్ ఉన్నతాధికారులు, పాలకవమండలి నిర్లక్ష్యం కారణంగా సామాన్యులు నిలువుదోపిడీకి గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్కానింగ్ కేంద్రాలు ఉన్నప్పటికీ పాలనా వైఫల్యం కారణంగా రోగులు ఆర్థిక ఇక్కట్లకు గురవుతున్నారు. జిల్లా ప్రభుత్వ సర్వజనా స్పత్రిలోనే ఇటువంటి పరిస్థితులు ఉంటే మిగిలిన 11 కమ్యూనిటీ ఆస్పత్రులు, జిల్లాస్థాయి ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో ఎటువంటి పరిస్థితులు ఉంటాయో ఆలోచించాల్సి ఉంది. గతేడాది జిజిహెచ్ బాధ్యతలను పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ధ్యాన్‌చంద్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒపి సేవల సదుపాయాన్ని కొనసాగించేలా చేసి, ఎటువంటి స్కానింగ్ సమస్యలు ఎదురవకుండా చూసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత జిజి హెచ్ పర్యవేక్షణ ఉన్నతాధికారి గత జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ తరహా పనితీరును కనబరిస్తే సామాన్యుల ఇబ్బందులను పరిష్కరించినవారవుతారనడంలో సందేహం లేదు. దీనిపై జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లను సంప్రదించగా అత్యవసర రోగులకు, అడ్మిషన్ రోగులకు స్కానింగ్ పరీక్షలు చేస్తున్నామని, రేడియాలజీ వైద్యుడు ఒక్కరే కావడంతో స్కానింగ్ పరీక్షలు చేయడానికి గడువులు ఇవ్వాల్సి వస్తుండడం వాస్తవమేనని పేర్కొనడం గమనార్హం.

డిజిటల్ విద్యావిధానానికి శ్రీకారం

- 19,148 మందికి ఉచితంగా ట్యాబ్‌లు
- రూ.8 కోట్లతో జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులు
- సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఎ.ప్రభాకర్‌రెడ్డి

డిజిటల్ విద్యా విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 3,253 పాఠశాలలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనకు కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయుల సాల్ట్, టిఆర్‌టిఎల్ వంటి శిక్షణా విధానాలతో తర్ఫీదు ఇవ్వడమైంది. జిల్లాలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధనకు గెస్ట్‌ఫ్యాకల్టీల నియమించడమైంది. కెజిబివిల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అవకాశం ఏర్పడింది. జిల్లాలోని 1007 ప్రభుత్వ పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ నాడు-నేడు పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొంటున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఎ.ప్రభాకర్‌రెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

డిజిటల్ బోధన తీరుతెన్నులపై స్పందించండి?

ప్రభుత్వం డిజిటల్ విద్య అందించడానికి ఏర్పాట్లు చేసింది. ఎనిమిదో తరగతి చదవుతున్న విద్యార్థులను 2025 సంవత్సరంలో జాతీయ స్థాయిలో నిర్వహించే సిబిఎస్ఇ పరీక్షలకు సన్నద్ధం చేయడంలో భాగంగా 5.18,740 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు ఇవ్వడమైంది. జిల్లాకు సంబంధించి 17,133 మంది విద్యార్థులకు, 2015 ఉపాధ్యాయులకు 19,148 మందికి ఉచితంగా ట్యాబులు ఇవ్వడమైంది. బైజూస్ కంటెంట్‌తో కూడిన 57 సబ్జెక్టులు 472 కాన్సెప్ట్‌లు, 300 వీడియోలు 160 సాల్వ్‌డ్ పేపర్స్ ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేయడమైంది. ఆడియో, వీడియోల ద్వారా స్వీయ అసెస్‌మెంట్ చేసుకోవడం జరుగుతోంది.

డిజిటల్ విద్య అమలు గురించి చెప్పండి?

జిల్లాలోని 230 స్కూల్‌కాంప్లెక్స్‌ల్లోని 3,253 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టాం. జిల్లాలోని 12 వేల మంది ఉపాధ్యాయులకు టీచింగ్ ఎట్‌రైట్ లెవెల్ (టిఎఆర్ఎల్) కింద శిక్షణా కార్యక్రమాన్ని నేటితో ముగించడమైంది. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు బోధన సదుపాయాల కల్పన, ఆటపాటల్లో చురుకుదనం, గ్రూప్ డిస్కస్ వంటి శాస్త్రీయ పద్ధతులతో విద్యను బోధించేందుకు అవసరమైన కసరత్తు చేశాం.

ఉపాధ్యాయుల శిక్షణ గురించి తెలపండి?

నూతన పద్ధతులతో కూడిన విద్యాబోధనకు ఉపాధ్యాయులకు వివిద రకాల శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నాం. టీచింగ్ ఆర్ట్ రైట్ లెవల్ (టిఎఆర్ఎల్), సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎస్ఎఎల్‌టి) పద్ధతుల ద్వారా ఉపాధ్యాయులకు మెళకువలను అందిస్తున్నాం.

కళాశాల్లో నాడూ-నేడు పథకం గురించి చెప్పండి?

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రూ.7.90 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. జిల్లాలోని తొమ్మిది జూనియర్ కళాశాలలను ఎంపిక చేశాం. రూ.1.53 లక్షలు మంజూరైంది. రూ.60 లక్షలతో ఎంపిక చేసిన జూనియర్ కళాశాలల్లో నాడు-నేడు పథకం కింద 11 రకాల పనులను చేపట్టాం.

నాడూ-నేడుకు నోచని పాఠశాలల పరిస్థితి ఏమిటి?

జిల్లాలో 1386 పాఠశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణ నిమిత్తం స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్స్ ఏర్పాటు చేసే ప్రయత్నం జరుగుతోంది. ఒక్కో స్కూల్‌కు రూ.10 వేల నుంచి రూ. రెండు లక్షల వరకు కేటాయించి వివిధ రకాల నిర్వహణ పనులు చేపడతాం. నాడూ-నేడూ-2 కింద జిల్లాలోని 36 మండలాల పరిధిలో 1007 విద్యాలయాల్లో ఎంపిక చేయడమైంది. వీటికి రూ.294 కోట్లతో పనులు చేపట్టడమైంది. 61 కోట్లతో 11 రకాల వసతుల కల్పన వేగం పుంజుకుంది. ఇప్పటివరకు రూ.57 కోట్లను వ్యయం చేయడమైంది.

కెజిబివిల్లో విద్యావిధానం గురించి చెప్పండి?

కెజిబివి పాఠశాలల్లో ఆటలు, పాటలు, మాటల్లో ప్రత్యేక తర్ఫీదు నిస్తున్నాం. స్పోర్ట్స్ విషయానికి వస్తే క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడం, క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచడం ద్వారా పిల్లల్లో దేహదారుఢ్య సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నాం. పాటల విషయాన్ని పరిశీలిస్తే పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నాం. మాటలు అంశానికి వస్తే క్లాస్‌రూమ్ సెమినార్స్ పేరుతో గతంలో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థులచే బోధించే ప్రణాళికను తయారు చేశాం. తద్వారా విద్యార్థుల్లో బిడియం, సిగ్గు వంటి ప్రగతి నిరోధక జాడ్యాలు తొలగి, భవిష్యత్ తరాలకు నాణ్యమైన మానవ వనరులను అందించే ప్రయత్నం చేస్తున్నాం.

మామి'డీ'లా

- అధిక వర్షాలతో రాలిపోతున్న పూత
- భారీగా దిగుబడి తగ్గిపోయే అవకాశం
- ఆందోళనలో రైతులు

పూత రాలిపోయిన మామిడి చెట్లు

ప్రజాశక్తి - రాయచోటి

ఫలరాజుగా పేరుగాంచిన మామిడి మూడేళ్లుగా సరైన దిగుబడులు రావడం లేదు. రెండేళ్లుగా కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ ఏర్పాటు చేయడంతో రైతులందరూ డీలపడ్డారు. గతేడాది ఆశించిన స్థాయిలో మామిడి పంట పండలేదు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో మామిడి పంట అధిక దిగుబడిలో వస్తాయని రైతులు ఆశ పడ్డారు. డిసెంబర్ నెల పూర్తవుతున్న అంతంత మాత్రమే పూత వస్తోంది. అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చేవారు కూడా లేరని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలతో పూత ఆలస్యం కావడం, అవే వర్షాలు పురుగులు, తెగుళ్ల ఆశించడానికి దోహదపడటంతో..పూత నిలవక, పిందె ఎదగక రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.

89 వేల ఎకరాల్లో మామిడి తోటలు

జిల్లాలో 89,657.5 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. జిల్లాల్లో చిట్వేలిలో 4,400 ఎకరాలు, రైల్వేకోడూరులో 9067, ఓబులవారిపల్లిలో 1625, పెనగలూరులో 3380, పుల్లంపేటలో 490, మదనపల్లిలో 1475, నిమ్మనపల్లిలో 2050, రామసముద్రంలో 1500, గుర్రంకొండలో 4145, కలకడలో 3445, కలికిరిలో 2737.5, కె.వి.పల్లిలో 4625, పీలేరులో 3500, వాల్మీకిపురంలో 2875, నందలూరులో 1780, రాజంపేటలో 935, టి.సుండుపల్లిలో 7590, వీరబల్లిలో 5262.5, చిన్న మండెంలో 6250, గాలివీడులో 2300, లక్కిరెడ్డిపలిల్లో 6000, రామాపురంలో 3582.5, రాయచోటిలో 222.5, సంబేపల్లిలో 3075, బి.కొత్త కోటలో 715, కురబలకోటలో 750, ములకలచెరువులో 625, పెద్ద మండెంలో 1960, పిటిఎంలో 542.5, తంబళ్లపల్లెలో 750 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ప్రతి ఏటా దాదాపు రూ.200 కోట్లకు పైగా విలువైన దిగుబడులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ సారి అధిక వర్షాలు, గాలులతో వాతావరణంలో మార్పులతో దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధిక వర్షాలతో తేమ ఆరక..

అయితే మామిడి దిగుబడిపై ఈ ఏడాది అధిక వర్షాలు ప్రభావం చూపాయి. సాధారణంగా జూన్, జూలైలోనే వర్షాలు ప్రారంభమై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు కురుస్తాయి. ఈ ఏడాది డిసెంబర్ చివరివరకూ అధిక వర్షాలు కురిశాయి. నేలల్లో తేమ శాతం పెరిగింది. తేమ ఆరక, చెట్టుకు పూత రాకుండా కొమ్మలు చిగురించాయి. గతంలో నవంబరు నుంచి పూత వస్తుంది. జనవరి వచ్చినా ఇప్పటి వరకు అంతంత మాత్రమే పోతా పూస్తున్నది. కొన్ని రకాల చెట్లలోనే అసలు పూత రాలేదు. వచ్చిన పూత కూడా పొగ మంచు కమ్మేస్తోంది. వచ్చిన పూత కూడా నల్లగా మగ్గిపోతోంది. ప్రతికూల పరిస్థితులతో తేనె మంచు, తామర, పూత తిచే పురుగులు, బూడిద, పూత, మాడు, ఆకుజల్లెడ తెగుళ్ళు వస్తున్నాయి. మూడేళ్లుగా పంటలకు సరైన ఆదాయం రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏడదైనా మామిడి పంట సాగు అధిక దిగుబడులు వచ్చి రైతన్నలకు ఏమాత్రం దిగబడి వస్తుందో వేచి చూడాల్సిందే.

వ్యాపారస్తులతో ఇబ్బందులు

వ్యాపారస్తులు మొదట మామిడి చెట్ల పూత, పిందెలను చూసి కొనుగోలు చేసి అడ్వాన్స్ ఇచ్చి, మామిడికాయలు కోసిన తర్వాత సగం డబ్బులు ఇచ్చి, తర్వాత తమకు నష్టం వస్తుందని సగం డబ్బులతోనే సరిపెట్టుకుంటున్నారు. గతంలో ఈదురుగాలులు, వర్షాలకు మామిడి కొమ్మలు, చెట్లు, మామిడికాయలు నేలపాలవుతున్నాయి. ప్రభుత్వం ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి ఈ ఏడాదైనా ఈదురుగాలులు వర్షాలకు రాలిపోయిన నెలపాలవుతున్న మామిడి చెట్లకు, మామిడికాయలకు నష్ట పరిహారం అందించాలి. **- సుబ్బారెడ్డి, రైతు, యండపల్లి, రాయచోటి.**

అధిక ఖర్చవుతోంది

మామిడి చెట్లకు ఏడాది పాటు దుక్కి చేయడం, చెట్లకు పాదులు తీయడం, మామిడి కొమ్మలు కత్తిరింపులు, ఎరువులు, మందులు, కూలీలు ,తోటకు కంచె అధిక ఖర్చులు అవుతున్నాయి. మామిడి పంట మాత్రం అంతంతే వస్తుంది. మందులు, ఎరువులు అధిక రేట్లను ప్రభుత్వం తగ్గించాలి.

- సుబ్రహ్మణ్యం, రైతు పీలేరు.

రైతులు ఆందోళన చెందొద్దు

గత సంవత్సరం మామిడి పంట సరిగ్గా రాలేదు. ఏడాది మామిడి పంట అధికంగా వస్తుంది. మామిడి పూత గత సంవత్సరం ముందస్తుగా పూసింది. ఏడాది జనవరి మొదటి వారం లోపల పూర్తిగా మామిడి పూత వస్తుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మామిడి తోటల్లో పూత సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో కొన్నిచోట్ల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి రైతుల్లో చైతన్యం చేస్తున్నాం. మామిడి పంట అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. నాణ్యమైన దిగుబడి రావడానికి నిపుణుల ద్వారా సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

- పి.రవి చంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి, రాయచోటి.

40 పరుగులకే కుప్పకూలిన అరుణాచల్‌ప్రదేశ్ జట్టు

కడప : రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఆదివారం నుంచి అండర్ 25 మెన్ సి.కె నాయుడు ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ప్రారంభ మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్ ఆంధ్ర- ప్రదేశ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు ఆంధ్ర బౌలర్ల దాటికి నిలువలేకపోయింది. మొదటి ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లలో 40 పరుగులకు ఆల్‌ఔట్ అయింది. ఆ జట్టులోని దాదో టాచుంగు 9, మాగుంగు 8 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని ఎం. ఆంజనేయులు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు, సాకేత్రామ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 264 పరుగులు చేసింది. ఆ జట్టులోని టి. వంశీకృష్ణ 127 (నాట్ అవుట్), ఎం. మహి కుమార్ 126 (నాట్ అవుట్) పరుగులు చేశారు. అరుణాచల్ ప్రదేశ్ జట్టులోని యోర్ జూమ్ ఒక వికెట్ తీసుకున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కడప అర్బన్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని 48వ డివిజన్ ఇన్‌ఛార్జి బంగారు నాగయ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఎఎస్ఆర్ నగర్, ఎన్ఎన్ఆర్, ఆచారి కాలనీల పరిధిలోని వృద్ధాప్య, వితంతువు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ముందుగా నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాగయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పోరాడుతున్న ఏకైక వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లు పెంచుకుంటూ నేడు అక్క, చెల్లెమ్మలకు, వృద్ధులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 250 పెంచి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఓబుల్ రెడ్డి, సుబ్బారాయుడు, చిన్నన్న, సుమన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

తేక్వాండోలో విద్యార్థికి గోల్డ్ మెడల్

కడప అర్బన్ : రవీంద్ర నగర్ లో ఉన్న ఎస్ ఎస్ నికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని షేక్. హరీమా సాదియా తేక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించారని కరస్పాండెంట్ ఎ. శ్రీనివాసులు తెలిపారు. మెడల్ సాధించిన విద్యార్థిని ఆదివారం కరస్పాండెంట్ అభినందించారు. అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డిసెంబర్ 28, 29, 30లలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

విద్యార్థికి 'బాసట' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరానికి చెందిన లోకేశ్వర్ మెడిసిన్ సీటు కోసం బాసట సంస్థ ఆర్థిక సాయం చేసింది. బాసట ప్రతినిధులు బాలాజీరావు, కార్తీక్ రెడ్డి స్పందించి దాతల సహకారంతో విద్యార్థి చదువుతకు రూ. 70 వేలను చెక్కు రూపంలో ఆదివారం అందజేశారు. చదువుకు సాయం చేసిన దాతలందరికీ విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సాత్విక్, నిఖిల్, హర్షిత్, సాయితేజ, శ్రీరామ్ పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న బాసట ప్రతినిధులు

అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర వీధుల్లో చలితో వణుకుతున్న అభాగ్యులకు 'ఇషాని ఫౌండేషన్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షులు జి.శివశంకర్, కార్యదర్శి బి. సుశీల్ కుమార్, సభ్యులు డాక్టర్ టి.సురేష్ బాబు, పి.చిట్టిబాబు, కె.రామకృష్ణ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, పాత కలెక్టరేట్, మద్రాస్ రోడ్డు రోడ్డు, వై జంక్షన్, ఎన్జీవో కాలనీ రోడ్డులలో ఫుట్ పాత్ పై నిద్రిస్తున్న వారికి దుప్పట్లు కప్పారు. కొంతమందికి ప్రత్యక్షంగా దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా శివ శంకర్ మాట్లాడుతూ ట్రస్ట్ రిజిస్ట్రేషన్ అయిన సందర్భంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. అధ్యాపక వృత్తిలో ఉన్న తమకు కార్యక్రమం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు.

పింఛను పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం

ప్రజాశక్తి - చాపాడు

లక్ష్మీపేటలో పింఛను పంపిణీ చేస్తున్న ఎంపిపి టి.లక్షుమయ్య

ఎన్నికలల్లో సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల డబ్బు పెంపు హామీని నెరవేర్చారని ఎంపిపి టి. లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మిపేట, ఖాదర్‌పల్లె గ్రామాల్లో కొత్తగా మంజూరైన రూ.2,750 పెరిగిన పింఛను డబ్బులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పింఛను పెంచి ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, లక్ష్మీపేట సర్పంచు శ్రీ విద్య, షమీంబాను, కన్వీనర్ చంద్ర మోహన్‌రెడ్డి, జైనుల్లా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రాణాలను కాపాడే రక్తదానం మహాదానమని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బైసాని సత్యనారాయణ పేర్కొ న్నారు. మండలంలోని

రక్తదానం చేస్తున్న నిఖిల్

చిలంకూరు గ్రామానికి చెందిన హెప్సీ అను మహిళకు రక్తం అవసరం కాగా సంస్థ సభ్యులు నిఖిల్ (బిట్టు) రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఆదివారం మాట్లాడుతూ బాధిత మహిళ స్థానిక సంధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతూ డాక్టర్ సలహా మేరకు బి-పాజిటివ్ రక్తం అవసరమైందన్నారు. బాధిత మహిళ కుటుంబికులు ఈ సమాచారాన్ని తమ సంస్థకు ఇచ్చారన్నారు. తాను అడిగిన వెంటనే నిఖిల్ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. రక్తదాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాధవ, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు.. తప్పని తిప్పలు

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రమైన కొండాపురంలో సిఎంఆర్ కాలనీలో ఉన్న రోడ్డుపై నిత్యం జన సంచారం అధికంగా ఉంటుంది. కొండాపురం పాత బస్టాండ్ ప్రాంతంలోని ప్రజలు సిఎంఆర్ కాలనీ ప్రజలు జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే ఇదే ఏకైక రహదారి. ఈ రహదారి పైకి చుట్టుపక్కల నివాస గృహాల వారు మురికి నీటిని, స్నానపు నీటిని, వృథాగా వదిలే కుళాయిలన నీటిని ప్రధాన రహదారిపైకి వదిలి వదులుతున్నారు. ఆ దారిలో తిరిగే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ రహదారిలో నిత్యం తిరిగే అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రహదారిలో వెళ్లేవారు పలువురు మురుగు నీటిలో పడి గాయాలవుతున్నాయి. చుట్టుపక్కల నివాస గృహాల వారు తమ ఇంటి ప్రాంగణంలో మురుగునీటి గుంతలు ఏర్పాటు చేసుకోకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శలను ప్రేక్షకులకు ఆకట్టుకున్నాయి. బావర్చి రెస్టారెంట్ సౌజన్యంతో మాష్టర్ టి.యువ కిషోర్, యువరాజ డ్యాన్సింగ్ స్కూలు చిన్నారులచే జానపద, సినీ పాటలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్, నృత్య శిక్షకుడు యువకిషోర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప/ కడప అర్బన్

కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని, వారు తలపెట్టిన కార్యక్రమాలు విజయవంతం కావాలని, అందరూ బావుండాలని కలెక్టర్ విజయ్ రామరాజు ఆకాక్షించారవు. ఆదివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన చాంబర్లో వివిధ శాఖల అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు తమ విధుల్లో కూడా సక్రమంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. తనను కలిసిన జిల్లా ప్రజలకు అందరికీ ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. **కాంగ్రెస్ కార్యాలయంలో...** కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావుకు పలువురు నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, వెంకటరమణారెడ్డి, పిసిసి డెలి గేట్ తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్,ఎన్ ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరిశివ, ఎస్టీ సెల్ నాయకుడు సేద్రం కుమార్, బీసీ నగర్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య, కణతల ప్రసాద్, అశోక్ , రేవంత్, అశోక్ కుమార్, శ్రీనివాసులు, శరత్ గౌరీ, సూర్యుడు, హర్ష, సత్యం శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు. **ప్రముఖులకు సలావుద్దీన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు** ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కలెక్టర్ విజయరామరాజు, ఎస్‌పి, కార్పొరేషన్ కమిషనర్, డిఎస్‌పి, వన్‌టౌన్, టూటౌన్ సిఐలను కలిసి శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేశారు. కార్యక్రమంలో జన వికాస్ సేవాసమితి అధ్యక్షుడు తాహిర్ పాల్గొన్నారు. **నూతన సంవత్సర కానుకగా పింఛన్ల పెంపు** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలతో వైయస్సార్ పెన్షన్ కానుక ఇకపై ప్రతి నెలా రూ.2,750.00 లకు పెంచారని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. ఆదివారం నగరంలోని 25, 34 వ డివిజన్ పరిధిలలో వైయస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా చేతుల మీదుగా జరిగింది. కార్యక్రమంలో 25, 34 డివిజన్ల కార్పొరేటర్లు సూర్యనారాయణ, అలీ అక్బర్, షేక్ మొహమ్మద్ షఫీ, అజ్మతుల్లా ఖాన్, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్నార్తై తోట కృష్ణ, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. **పేదలకు అన్నదానం, పండ్లు పంపిణీ** కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ క్రీస్తు చర్చిలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, చిన్నారులకు మాస్కులు, సబ్బులు, పండ్లు పంపిణీ చేసి, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బుడగజంగం జిల్లా అధ్యక్షులు దూపం రాజు, విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, రోజా, అగస్టిన్, చిరంజీవి, నరసయ్య, చందు, దావీదు, లీలావతి, సరళ, సుగుణమ్మ పాల్గన్నారు. **ఎస్‌టియు డైరీ ఆవిష్కరణ** ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2023వ సంవత్సర డైరీని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి. రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జమాల్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎలియాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.వి.సుబ్బారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు రామలక్ష్మణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా సిపిఎస్ కో కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, బాలిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. **వికాస్ హై స్కూల్‌లో..** కడప నగరం స్థానిక ఐటిఐ సర్కిల్, అక్కయ్య పల్లెలో ఉన్న వికాస్ ఈఎం హైస్కూల్లో స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ ఆధ్వర్యంలో నూతన సంవత్సర సంబరాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. టిడిపి పొలిటీ బ్యూరో మెంబర్ శ్రీనివాసులు రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ లీడర్ జిలాని భాష, స్కూల్ వ్యవస్థాపకురాలు సరసమ్మ, ముఖ్య అతిథులుగా హాజరై స్కూల్ కరస్పాండ్ వికాస్ హరికృష్ణతో కలిసి కేకును కట్ చేసి స్కూలు ఉపాధ్యాయులకు విద్యార్థులకు తల్లిదండ్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. **బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..** బిసి సంఘ కార్యాలయంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, సంఘం ప్రతినిధులు బంగారు నాగయ్య యాదవ్, గురు స్వామి, కొప్పుల శివ యాదవ్, మధుసూదన్, వల్లూరు నారాయణమ్మ, సుంకేసుల ఖాదర్బాషా, పస్తం అంజి, నాగేశ్వరరావు, జయశ్రీ, జయలక్ష్మి, వెంకటలక్ష్మి, చేలో రవి. శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, కృష్ణమూర్తి, బి బి జాన్ పాల్గొన్నారు. **శ్రీనివాస రెడ్డికి గజమాలతో సత్కారం**..టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాస రెడ్డిని నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం గజమాలతో, శాలువతోఘనంగా సన్మానించారు. **వృద్ధులకు, యచకులకు అన్నదానం** నగరంలోని పలు కూడలిలో అసరాలేని వృద్ధులకు, యాచకులు 150 మందికి బిర్యానీ ప్యాకెట్లను నూతన సంవత్సరం సందర్భంగా జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తాహిర్ అందజేశారు. కార్యక్రమంలో జన వికాస్ ప్రతినిధులు శివ, మస్తాన్‌వల్లి, రాజేష్ పాల్గొన్నారు. **ఎన్‌జిఒ కేలండర్ ఆవిష్కరణ..** ఎన్‌జిఒ టేబుల్ కేలెండర్‌ను కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు బి. శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్, జిల్లా, నగర, ఉమెన్ వింగ్ నాయకులు పాల్గొన్నారు. **చెన్నూరు :** మండల వ్యాప్తంగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు, శనివారం అర్ధరాత్రి అన్ని ప్రార్ధన మందిరాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి

చాపాడు : ఎమ్మెల్యేని సన్మానిస్తున్న ఎంపిపి, మాజీ జడ్‌పిటిసి

మండల కన్వీనర్ జి.ఎన్ భాస్కర్ రెడ్డి , ఎంపిడిఒ గంగనపల్లి సురేష్‌బాబు, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్, నీలం శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసిలు పెనుమారు రఘురామిరెడ్డి, దుంప నాగిరెడ్డి, సాదిక్ అలీ, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, టిఎన్, కుమార్ రెడ్డి, టి ఎన్ చంద్ర రెడ్డి కార్యదర్శులు రామ సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, మండల అధికారులు ,ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. **బద్వేల్‌లో డివైఎఫ్‌ఐ కేలండర్ ఆవిష్కరణ** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సర కేలండర్‌ను నుబద్వేల్ అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బద్వేల్ సర్కిల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఎస్. రవికుమార్, ఎస్. ఫయాజ్, జి. నాగార్జు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** 2023 ఆంగ్ల సంవత్సర ప్రారంభ వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు శుభాకాంక్షలు తెలుపు కున్నారు. పులివెందుల నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి, వైఎస్ మధుసూదన్‌రెడ్డి, పురపాలక చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, ఇతర నాయకులను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, వైసిపి పులివెందుల పట్టణ విద్యార్థుల విభాగం అధ్యక్షుడు జస్వంత్‌రెడ్డి, పాత్రికేయులు కష్ణకుమార్, కార్తీక్ పాల్గొన్నారు. **ముద్దనూరు :** నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ, ఆర్‌సిఎం, సిఎస్ఐ (ఎస్‌పిజి) హెబ్రోన్, మన్నా, హోసన్నా చర్చిల్లో ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ పాస్టర్ దేవసహాయం, సిఎస్ఐ (ఎస్పీజీ) చర్చిలో రెవరెండ్ పాస్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచు సరళ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ఎమ్‌సి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చిన్నారుల ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ప్రజలకు నాయకత్వం గల సేవకుడిగా ఉంటానని టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆంగ్ల సంవత్సరం సందర్భంగా పలురువు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ తనను, పార్టీని నమ్ముకొని ఉన్న ప్రతి కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటానన్నారు. టిడిపి రథసారథి చంద్రబాబు, లోకేష్ ఆధ్వర్యంలో 2024 జమ్మలమడుగులో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసి, బాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్

పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో ముందుండాలని కోరారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. **చాపాడు :** మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డికి ఆదివారం నియోజకవర్గ పరిధిలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చాపాడు, మైదుకూరు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట మండలాల ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు ఎమ్మెల్యేను కలిసి శాలువా, పూలమాలలు, బొకేలు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మైదుకూరు డివిజనల్ పోలీసు అధికారులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిచే భారీ కేకు కట్ చేయించారు. డిఎస్‌పి వంశీధర్ గౌడ్, రూరల్ సిఐ నరేంద్రరెడ్డి, అర్బన్ సిఐ చలపతి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. చాపాడు ఎంపిపి టి.లక్షుమయ్య, మాజీ జడ్‌పిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, వైసిపి నాయకులు జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జయ సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆకాంక్షించారు. ప్రొద్దుటూరులోని ఆయన నివాసం వద్ద ఆది వారం టిడిపి నాయకులు పుట్టాను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల సుదర్శన్, జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు వైవి సుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, నాయబ్, సలీం, వెంకట రమణారెడ్డి నారాయణరెడ్డి, నారపరెడ్డి, కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిధిలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహి ంచారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది తమ ఉన్నతాధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకు న్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి టి. లక్ష్మయ్య, ఎంపిడిఒ శ్రీధర్‌నా యుడును సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒలు తహశీల్దార్ సుభానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ఆయనచే కేక్ కట్ చేయించారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలను సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. **వేంపల్లె :** నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితం ఉజ్జ్వలంగా ఉండాలని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి వేర్వేరుగా ఆకాంక్షించారు. వారు వారి కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే ఆయా పార్టీల నాయకుల వద్దకు ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, కార్యకర్తలు వెళ్లి సన్మానాలు చేశారు. **దువ్వూరు :** మండలంలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మైదుకూరు డిఎస్‌పి వంశీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పోలీసులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఏడాదిలో కొత్త లక్ష్యాలను ఎంచుకొని, వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి, పాఠశాల ప్రత్యేక అధికారి మల్లేశ్వరి, సిబ్బంది, విద్యార్థులు **ప్రొద్దుటూరు :** పట్టణంలోని విభిన్నప్రతిభావంతులకు ఆదివారం స్థానిక కూరగాయల మార్కెటలో పండ్ల వ్యాపారి ఖాదర్‌వలి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. వారికి స్టీల్‌ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల, వయోవృద్ధుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు, రషీద్, దస్తగిరి, సావిత్రి, మల్లీస్వరి, యధార్థుడు, కొండమ్మ పాల్గొన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో తనదైన పాత్ర పోషిస్తున్న పోలీసు లేని సమాజాన్ని ఊహించలేమని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోస మనోహర్ పేర్కొన్నారు. స్థానిక టూటౌన్ సిఐ ఇబ్రహీంకు ఆదివారం నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పులివెందుల రూరల్ : వైఎస్.భాస్కర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నీలి శ్రీనివాసరావును సన్మానిస్తున్న చెప్పలి పుల్లయ్య, నాయకులు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డికి కేక్ తినిపిస్తున్న నాయకులు

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

108 వాహనలో వేణుగోపాల్

ప్రజాశక్తి ఎర్రగుంట్ల

స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో చిలకపాటి వేణుగోపాల్ (39) అనే వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి మంటలను ఆర్పి, 108కు సమాచారమిచ్చారు. వారు ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని అతని వద్దనున్న ఆధారాలతో భార్య అంజలికి సమాచారమిచ్చారు. అతను కడప టౌన్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేర్వేరు ప్రమాదాల్లో యువకులకు గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె, వేముల మండలాల్లో చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మహబూబ్ బాషా, శివ అనే యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం వేముల సమీపంలో కర్నూలు జిల్లా బేతంచర్లకు చెందిన శివ అనే వ్యక్తి వేముల నుండి కర్నూలుకు బైకులో వెళుతుండగా బైకు ఎద్దుల బండిని ఢీ కొంది. దీంతో శివ గాయపడడంతో వేంపల్లె ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. వేంపల్లె గ్రామంలోని గండి రోడ్డులో రెండు బైకులు ఢీ కొన్న సంఘటనలో స్థానిక మహబూబ్ బాషా అనే వ్యక్తి గాయపడగా వేంపల్లె ఆసుపత్రికి తరలించారు.

సిబిఆర్ వద్ద పర్యాటకుల సందడి

సిబిఆర్ వద్ద పర్యాటకులు

ప్రజాశక్తి - లింగాల

పార్నపల్లిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పర్యాటకుల సంఖ్య నిత్యం పెరుగుతోంది. గతేడాది డిసెంబర్ 2న రూ.4.5 కోట్లతో పార్కు రెస్టారెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు అప్పటి నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ఆదివారం దాదాపు 2000 మంది పర్యాటకులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడ చిన్న పిల్లలకు ఉయ్యాల జారుడుబండ, పార్కులో రకరకాల పూల మొక్కలతో అందరిని ఆకర్షిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో సిబిఆర్ వద్ద ఉత్సాహంగా పాల్గొన్నారు. బోటింగ్ కనువిందు చేస్తోంది. ఇక్కడ నాలుగు పడవలు ఉండగా, వాటిలో జెట్ స్పీడు రెండుచ డీలక్స్ ఉన్నాయి. జలవిహారంలో పర్యాటకులు ఆనందాన్ని పంచుకున్నారు.

బోటింగ్‌లో పర్యాటకులు

ధాన్యం నిలువకు సరిపడ గోదాములేవీ..?

- గిట్టుబాటు ధర వచ్చే వరకూ ధాన్యం ఉంచుకునేందుకులేని అవకాశం.. పొలాల్లో అమ్మకాలకే ప్రాధాన్యం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పండించిన వరి ధాన్యం నిల్వ ఉంచు కునేందుకు సరిపడ గోదాములు అందుబాటులో లేవు. దీంతో పంట నూర్పిడి చేయగానే రైతులు ఉన్న ధరకే ఉత్పత్తులను అమ్ముకోవాల్సిన పరిస్థితి. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో ఖాజీపేటలో 4,200 హెక్టార్లు, మఠం మండలంలో 5,500 హెక్టార్లు, దువ్వూరులో 3,515 హెక్టార్లలో, చాపాడులో 6,020, మైదుకూరులో 2,070 హెక్టార్లలో వరి పైరును రైతులు సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 53 వేల ఎకరాల్లో వరి పైరు సాగైంది. ఎకరాకు 30 బస్తాల వంతున దిగుబడి వచ్చిన ప్పటికీ 17 లక్షల బస్తాలకు పైగా దిగుబడి వచ్చింది. 14 ప్రయివేటు, 2 మార్కెట్ యార్డ్ వారి వరి ధాన్యం నిల్వ గోదాములు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మఠం మండల పరిధిలో వరి ధాన్యం నిల్వ గోదాములు అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న వాటిలో 3.50 లక్షల బస్తాల నుంచి నాలుగు లక్షల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. మిగిలిన వరి ధాన్యాన్ని నిలువ చేసుకునే అవ కాశాలు లేవు. ఈ పరిస్థితుల్లో పొలాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి సచివాలయ పరిధిలో గోడౌన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అది ఆచరణలో అమలుకాలేదు. పంటను గిట్టుబాటు ధర వచ్చే వరకు నిలువ చేసుకునే వెసులుబాటు ఉండడం లేదు. జిల్లాలో వచ్చే వరి దిగుబడిలో 40 శాతంపైగా మైదుకూరు నియోజకవర్గంలోనే వస్తుంది. కాబట్టి రైతులు పండించిన పంట గిట్టుబాటు ధర వచ్చే వరకు నిలువ ఉంచుకునేలా వరి ధాన్యం గోదాములను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ప్రయివేట్ రంగంలో కూడా గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రస్తుతం 8 బస్తాల ధర రూ.12వేలు ఉంది. 2021 డిసెంబర్‌లో 8 బస్తాల ధర రూ.9వేల లోపు ఉండేది. ఇవి ఆగస్టు నెలకు రూ.18వేలకు చేరు కున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. అదే నిలువకు అవకాశం ఉంటే గిట్టు బాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉండేది. రైతుకు పంట పొలాల్లో పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఉండదు. ప్రభుత్వం నూతనంగా కొన్ని గ్రామాలను ఎంపిక చేసి గోడౌన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడు తోంది. తహశీల్దార్లు ఖాళీ ప్రదేశాలను గుర్తించి సమాచారాన్ని ఆర్‌డిఒకు పంపారు. వచ్చే ఏడాదికైనా గ్రామాల్లో గౌడౌన్‌లను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఖాజీపేట మండలంలోని కుమ్మరకొట్టాల వద్దనున్న గోడౌన్

ధాన్యం నిలువకు అవకాశం లేదు

అయిదెకరాల్లో వరి పంటను సాగు చేశాను. ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో పంట పొలాల్లో వరి ధాన్యాన్ని అమ్మకం చేపడుతున్నాం. రైతులు నిలువ ఉంచుకునేందుకు అవసరమైన గోదాములు అందుబాటులో ఉంటే.. గిట్టుబాటు ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది.

- వెంకట సుబ్బయ్య, రైతు, సోమాపురం ఎస్‌సి కాలనీ

గోడౌన్‌లను ఏర్పాటు చేస్తే ఉపయోగం

గ్రామాల్లో గోడౌన్లను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం గోడౌన్‌లు సమీపంలో అందుబాటులో లేక పోవడంతో ఇతర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించాల్సి వస్తుంది. చాలామంది రైతులు నిలువ ఉంచేందుకు అవకాశం లేక పంట పొలాల్లోనే అమ్మకాలు చేపడుతున్నారు. ఆరు ఎకరాల్లో వరి పంటను సాగు చేపట్టాను. గోడౌన్‌లో నిలువ ఉంచేందుకు ప్రయత్నాలు చేపడుతున్నాం.

- శ్రీను, రైతు, లక్ష్మీపేట